ఆహ్లాదం పంచుతున్న
ఉద్యానవనాలు

● శారీరక దారుఢ్యం కోసం యువత ● సంబరం కోసం చిన్నారులు ● ఓపెన్ జిమ్‌లలో వ్యాయామం


ఎస్ఆర్‌నగర్ పార్కులో బెంచీలపై సేదతీరుతున్న వాకర్లు

అమీర్‌పేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట డివిజన్ ఎస్ఆర్‌నగర్, బీకేగూడలోని ఉద్యానవనాలు పచ్చనిచెట్లు, పక్షుల కిలకిలరావాలు, ఆహ్లాదమైన వాతావరణం, స్వచ్ఛమైన గాలిని అందిస్తూ వాకర్లు, సందర్శకులను మంత్రముగ్ధుల్ని చేస్తున్నాయి. సనత్‌నగర్ డివిజన్‌లోని కాలనీలు, బస్తీల్లో 50కి పైగా పార్కులుండగా, అమీర్‌పేట డివిజన్‌లో రెండు, మూడు మాత్రమే ఉన్నాయి. స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ గతంలో మంత్రిగా కొనసాగినప్పుడు నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలోని పార్కుల్లో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేయించారు. వీటిలో వ్యాయామం చేసేందుకు వయోధికులు, చిన్నారులు, యువత పోటీలు పడుతున్నారు. ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకు పార్కులు తెరిచి ఉంచడంతో ఉదయం వేళ వందల సంఖ్యల్లో వాకర్లు పార్కుకు వచ్చి గంటల తరబడి వాకింగ్ చేస్తూ శారీరక, మానసిక ఉల్లాసాన్ని పొందుతున్నారు.


పచ్చనిచెట్లతో కళకళలాడుతున్న బీకేగూడ పార్కు

పుస్తకాలతో యువత కుస్తీ..

బీకేగూడ పార్కులో ఉద్యానవన శాఖ అధికారులు రకరకాల పూల మొక్కలు, ఏపుగా పెరిగే చెట్లను నాటడంతో అవి మహావృక్షాలుగా ఎదిగి సందర్శకులను కనువిందు చేస్తున్నాయి. పోటీ పరీక్షలకు సన్నద్ధులవుతున్న యువతీయువకులు సమయం దొరికినప్పుడల్లా పార్కుకు వస్తూ పుస్తకాలతో పోటీ పడుతున్నారు. ఇటీవల జీహెచ్ఎంసీ, ఉద్యానవన శాఖ అధికారులు పార్కులపై ప్రత్యేక దృష్టి సారించి, ఫాత్‌వేలు, కూర్చునేందుకు బెంచీలను ఏర్పాటు చేయడంతో వాకర్లల సందడి మరింత పెరిగింది.

బీకేగూడ పార్కులో యోగశాల భవనం

యోగాభ్యాసకుల అభ్యర్థన మేరకు తలసాని శ్రీనివాస్ యాదవ్ బీకేగూడ పార్కులో రూ.38 లక్షలతో


ఎస్ఆర్‌నగర్ లైబ్రరీ పార్కు, ఓపెన్ జిమ్‌లో వ్యాయామం చేస్తున్న యువత

యోగశాల భవనాన్ని ఏర్పాటు చేయించారు. ప్రస్తుతానికి ఆ భవన నిర్మాణం పూర్తయినప్పటికీ ప్రారంభించడం లేదు. గతంలో వర్షాకాలం వచ్చిందటే ఈ పార్కులో యోగా చేయడం ఇబ్బందిగా ఉండేది. ప్రస్తుతం ఈ భవనం అందుబాటులోకి రావడంతో యోగా చేసేవారికి ఇబ్బందులు తప్పిపోయినట్లే.

మూత్రశాలలు లేక ఇబ్బందులు..

ఎస్ఆర్‌నగర్ లైబ్రరీ పార్కు, బీకేగూడ పార్కులో మరుగుదొడ్లు, మూత్రశాలలు లేకపోవడంతో వాకర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారు. నగరంలో రోజురోజుకూ డయాబెటిస్ బాధితుల సంఖ్య అధికంకావడం, పార్కుల్లో మూత్రశాలలు లేకపోవడం పట్ల చిన్నారులు, వయోధికుల బాధలు వర్ణనాతీతంగా మారాయి. మూత్రం ఆపుకోలేని కొందరు పార్కు పక్కన ఉన్న సీనియర్ సిటిజన్స్ భవనం సందులో మూత్ర విసర్జన చేస్తున్నారు. దీంతో ఈ ప్రాంతం దుర్గంధాన్ని వెదజల్లుతోంది. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి మరుగుదొడ్లు, మూత్రశాలలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

మూత్రశాలలను వెంటనే ఏర్పాటు చేయాలి



బీకేగూడ పార్కుకు వచ్చే సందర్శకులు, వాకర్లు, సీనియర్ సిటిజన్స్ మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శారీరక దారుఢ్యం, మానసిక ప్రశాంతత కోసం పార్కుకు వస్తున్న వారు కనీసం గంట కూడా ఉండడం లేదు. సువిశాల స్థలం, పచ్చిక బయళ్లు, సువాసనలు వెదజల్లే చెట్లు, పూల మొక్కలు ఉన్న ఈ పార్కులో మూత్రశాలలు లేకపోవడం వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా తయారవుతున్నాయి. వెంటనే జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి మూత్రశాలలను ఏర్పాటు చేయాలి.

- కట్టా బలరాం, స్థానికుడు


జ్ఞానీజైల్‌సింగ్ నగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

అభివృద్ధి విషయంలో రాజకీయం తగదు

● కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

బంజారాహిల్స్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి విషయంలో రాజకీయం చేయడం తగదని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ అన్నారు. ఫిలింనగర్ జ్ఞానీ జైల్‌సింగ్‌నగర్‌లో మంగళవారం ఆయన పర్యటించారు. రూ.19.50 లక్షల నిధులు మంజూరైనా ముందుకు సాగని రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ బస్తీవాసుల ఇబ్బందులు చూసి రోడ్డు కోసం నిధులు మంజూరు చేయడంతో పనులకు తాను శంకుస్థాపన చేసినట్టు చెప్పారు. కొందరు ఎమ్మెల్యే శంకుస్థాపన చేసే వరకు పనులు నిర్వహించవద్దని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ప్రజలకు ఉపయోగ పడే పనుల విషయంలో రాజకీయం చేయడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. రోడ్డు వేసేలా చర్యలు తీసుకోవాలని త్వరలో జీహెచ్ఎంసీ కమిషనర్‌ను కలవనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.


ప్రత్యేక వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మన్నె కవిత

దోమల నియంత్రణకు ప్రత్యేక డ్రైవ్

బంజారాహిల్స్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలోని అన్ని బస్తీల్లో దోమల నియంత్రణకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని కార్పొరేటర్ మన్నె కవిత అన్నారు. మంగళవారం దేవరకొండ బస్తీలో డిప్యూటీ కమిషనర్ సోమయ్యతో కలిసి కార్పొరేటర్ స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వర్షాకాలంలో దోమలు, ఈగలు వృద్ధి చెందకుండా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. ఎంటమాలజీ సిబ్బందితో దోమల మందును బస్తీల్లో పిచికారి చేయించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొన్నారు

మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం విఫలం

● కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

వెంగళరావునగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. పేరుకే కమాండ్ కంట్రోల్ ఉంది కానీ సీసీ కెమెరాలు లేకపోవడంతో కాలనీల్లో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలను గుర్తించలేని పరిస్థితి నెలకొందని ఆయన ఆరోపించారు. మంగళవారం వెంగళరావునగర్‌లో నిర్మాణంలో ఉన్న బహుళ ప్రయోజన ఫంక్షన్‌హాల్‌ను ఆయన సందర్శించారు. అక్కడే కాలనీవాసులు, కాలనీ సంక్షేమ సమితి ప్రతినిధులతోపాటు పలు విభాగాల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. స్థానికులు, కాలనీ సంక్షేమ సమితి ప్రతినిధులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను కిషన్‌రెడ్డి ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కనీసం వీధిలైట్లు వేయించలేని దుర్భరమైన స్థితిలో ఉందని ఎద్దేవా చేశారు. సమావేశంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకాల దీపక్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్, కాలనీ సంక్షేమ సమితి అధ్యక్షుడు చిలకల వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పి.ఎస్.రాజు, ఉపాధ్యక్షులు ప్రసాద్, అర్జున్, ధనుంజయరెడ్డి, మాజీ అధ్యక్షుడు రాజశేఖర్ గుప్తా, శివకుమార్, విజయభాస్కర్, సికింద్రాబాద్ ఆర్డీవో సాయిరాం, ఖైరతాబాద్ తహసీల్దార్ నయీముద్దీన్, జలమండలి జీఎం హరిశంకర్, జీహెచ్ఎంసీ సర్కిల్-19 డీఎంసీ జకియా సుల్తానా, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ ప్రసీద, వివిధ శాఖల అధికారులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నాగార్జుననగర్ కాలనీలో..

శ్రీనగర్‌కాలనీ డివిజన్ నాగార్జుననగర్ కాలనీ కమ్యూనిటీహాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ సమితి ప్రతినిధులు, కాలనీవాసులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఆయా సమస్యలను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. సమావేశంలో నాగార్జుననగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శశాంక మౌళి, ఉపాధ్యక్షుడు కృష్ణారావు, కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో హెడ్ నర్సు మృతి


స్వప్న సెబాస్టియన్

ఖైరతాబాద్ జూన్ 3 (ఆంధ్రజ్యోతి): విధులు నిర్వహిస్తూ కేర్ ఆస్పత్రిలో హెడ్ నర్సు ఆకస్మికంగా మృతిచెందారు. ఖైరతాబాద్ ప్రేమ్ నగర్ నివాసి స్వప్న సెబాస్టియన్(44) బంజారాహిల్స్ కేర్ ఆస్పత్రిలో హెడ్ నర్సుగా పనిచేస్తున్నారు. మంగళవారం ఉదయం విధులకు హాజరైన స్వప్న ఆస్పత్రిలో జరుగుతున్న శిక్షణ శిబిరంలో పాల్గొనేందుకు పై అంతస్తుకు వెళ్లింది. మధ్యలో బాత్రూం వెళ్లి వస్తానని చెప్పి బయటకు వచ్చిన ఆమె బాత్రూంలో పడిపోయింది. విషయం తెలుసుకొని అదే ఆస్పత్రిలో చికిత్స అందించినా ఫలితం లేక మృతిచెందింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

గోవుల రవాణా వాహనం సీజ్

యూసుఫ్‌గూడ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా గోవులను తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు సీజ్ చేశారు. మధురానగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కార్మిక నగర్‌కు చెందిన ముబీన్, సల్మాన్, ముస్తఫా పాతబస్తీ నుంచి ఎలాంటి పత్రాలు లేకుండా తొమ్మిది ఎద్దులను రెండు వాహనాల్లో మంగళవారం తెల్లవారుజామున తరలిస్తున్నారు. పోలీసులు వాహనాన్ని నిలిపి ధ్రువపత్రాలను పరిశీలించారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో వ్యాపారి ఎండీ నవీద్ ఖురేషిపై కేసు నమోదు చేశారు. వాహనాన్ని సీజ్ చేశారు.

నకిలీ డాక్టర్‌పై కేసు నమోదు

బేగంపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ సర్టిఫికేట్ లేకుండా క్లీనిక్ నడుపుతున్న ఓ వ్యక్తిని విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని బేగంపేట పోలీసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రసూల్‌పుర అన్నానగర్‌లో మహేందర్ కొంతకాలంగా క్లీనిక్ నడుపుతున్నాడు. క్లీనిక్‌లో అన్ని పరీక్షలు చేయడంతోపాటు పలు వైద్య పరికరాలు, మందులు అందుబాటులో ఉన్నాయి. డాక్టర్‌పై అనుమానం రావడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులకు స్థానికులు సమాచారం ఇచ్చారు. సోమవారం రాత్రి వారు క్లీనిక్‌పై దాడి చేశారు. ఆ సమయంలో ఆస్పత్రిలో పెషెంట్లకు వైద్య పరీక్షలు చేస్తున్న మహేందర్‌ను డాక్టర్ పట్టా చూపించమనగా నీళ్లు నమిలాడు. దీంతో అతడిని అదుపులోకి తీసుకోవడంతో పాటు క్లీనిక్‌లో ఉన్న వైద్య పరికరాలను, మందులను స్వాధీనం చేసుకుని బేగంపేట పోలీసులకు అప్పగించారు. ఎలాంటి డాక్టర్ పట్టా లేకుండా క్లీనిక్ నడుపుతున్న మహేందర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బంగారం గొలుసు చోరీ

యూసుఫ్‌గూడ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో నుంచి ముగ్గురు గుర్తు తెలియని మహిళలు బలవంతంగా బంగారం గొలుసును లాక్కెళ్లారు. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫిలింనగర్‌కు చెందిన ఈ.అంజమ్మ సికింద్రాబాద్ వెళ్లి వెండి వస్తువులను తయారు చేయించుకొని ఇంటికి వస్తుంది. యూసుఫ్‌గూడ బస్తీ బస్టాప్‌లో దిగి సమీపంలోని కల్లు కాంపౌండ్‌కు వెళ్లింది. అక్కడ ముగ్గురు మహిళలు వచ్చి మాటలు కలిపారు. బలవంతంగా ఆమె మెడలోని బంగారు గొలుసును తెంపుకొని పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.


చిన్నారెడ్డి, దివ్యకు వినతిపత్రం ఇస్తున్న అబ్కారీ పోలీసులు

సీఎం ప్రజావాణికి 221 దరఖాస్తులు

బేగంపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఎనిమిదేళ్లుగా బదిలీలు లేకుండా ఉన్న తమను ఇతర స్థానాలకు బదిలీ చేయాలని కోరుతూ అబ్కారీ శాఖకు చెందిన చెందిన హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు దరఖాస్తు ఇచ్చారు. బాసరలోని వక్ఫ్‌బోర్డుకు చెందిన వందకు పైగా ఎకరాలను కొందరు కబ్జా చేశారని, ఆ భూమిని కబ్జాదారుల చెర నుంచి విడిపించి వక్ఫ్‌బోర్డుకు చెందేలా చేయాలని మాజీ ఎంపీటీసీ సయ్యద్ ఖలీల్ వినతిపత్రం ఇచ్చారు. ఇలా పలు ఫిర్యాదులు మంగళవారం మహాత్మాజ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన సీఎం ప్రజావాణికి వచ్చాయి. వాటిని పరిశీలించిన ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్య తగిన చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. ప్రజావాణికి మొత్తం 221 దరఖాస్తులు వచ్చాయి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 35, రెవెన్యూ 53, ఇందిరమ్మ ఇళ్ల కోసం 42, మున్సిపల్‌కు 19, విద్యుత్ 15, ప్రవాసీ ప్రజావాణికి 1, ఇతర శాఖలకు చెందిన 56 దరఖాస్తులు వచ్చినట్లు అధికారి తెలిపారు.


నిరంజన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆయా సంఘాల నాయకులు

పేరు చివర పటేల్ పెట్టుకునేలా గెజిట్ ఇవ్వాలి

పంజాగుట్ట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అత్యధిక జనాభా గల మున్నూరుకాపులకు పేరు చివర పటేల్ అని పెట్టుకునేలా గెజిట్ ఇవ్వాలని మున్నూరుకాపు జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర కో-ఆర్డినేటర్ వెంకట్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఖైరతాబాద్‌లోని బీసీ కమిషన్ కార్యాలయంలో కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తమ వినతిపై నిరంజన్ సానుకూలంగా స్పందించారని వెంకట్ తెలిపారు. కార్యక్రమంలో ఫోరం, పటేల్ యూత్ ఫోర్స్ నాయకులు రాకేష్, కె.రాజు, పి.వెంకటేష్, అక్షయ్, భరత్, సిద్ధార్థ్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

సంతోష్‌నగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సంతోష్‌నగర్ డివిజన్ ఏసీపీ ఠాకూర్ సుఖ్‌దేవ్‌సింగ్ హెచ్చరించారు. బక్రీద్ పండగ సందర్భంగా సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు మంగళవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. సత్ప్రవర్తనతో మెలగాలని రౌడీషీటర్లకు సూచించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ కోల సత్యనారాయణ, అదనపు ఇన్‌స్పెక్టర్ జగన్‌రెడ్డి, ఎస్ఐలు శివప్రసాద్, రవిగౌడ్, మణికంఠ, స్వామి తదితరులు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం.. ఇద్దరిపై కేసు

సైదాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం చేసిన ఇద్దరు వ్యక్తులపై సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. సైదాబాద్ పరిధిలో ఓ బస్తీలో నివసిస్తున్న బాలిక(16) తమ్ముడు, చెల్లెలితో కలిసి గ్రీన్‌పార్క్ కాలనీకి చెందిన మన్నె జగన్ ఆటోలో వెళ్లేంది. ఆటో డ్రైవర్‌తో బాలిక చనువుగా ఉండేది. దీంతో ఆటో డ్రైవర్ ఆమెకు మాయమాటలు చెప్పి పలుమార్లు అత్యాచారం చేశారు. బాలిక పొరుగు ఇంటికి టీవీ చూడటానికి వెళ్తుండేది. అన్నగా పిలిచే బాలరాజు ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాలికపై అత్యాచారం చేశాడు. బాలిక విషయం కుటుంబ సభ్యులకు చెప్పగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. సైదాబాద్ పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేబీఆర్ పార్కులో పనులను పూర్తి చేయాలి

బంజారాహిల్స్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కేబీఆర్ పార్కులో వాకర్ల సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన పనులను వినూత్నంగా చేపట్టి పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కమిషనర్ పార్కులో చేపట్టిన పనులను జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. లైసెన్స్ తీసుకున్న పెట్ డాగ్స్‌ను మాత్రమే పార్కులోకి తీసుకురావాలని పెట్ డాగ్స్ యాజమాన్యానికి కమిషనర్ సూచించారు. కేబీఆర్ పార్కు చుట్టూ హెచ్ సిటీ ద్వారా చేపట్టే ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు కోర్టు ఆదేశాల మేరకు నిర్మిస్తున్నారా? అంటూ ప్రాజెక్ట్ ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ సుభద్రదేవి, డీసీ సమ్మయ్య, ప్రాజెక్ట్ ఎస్ఈ శ్రీలక్ష్మి, డిప్యూటీ ఈఈ హరీష్, సర్కిల్ ఈఈ విజయకుమార్ పాల్గొన్నారు.


పనులపై అధికారులతో చర్చిస్తున్న ఆర్వీ కర్ణన్

ఎన్ఆర్ఐ చిన్నారికి కోక్లియర్ ఇంప్లాంట్ శస్త్ర చికిత్స


కోక్లియర్ ఇంప్లాంట్ చేసిన చిన్నారితో వైద్యులు

బంజారాహిల్స్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): తీవ్ర వినికిడి లోపంతో బాధపడుతున్న తొమ్మిది నెలల ఎన్ఆర్ఐకి అపోలో వైద్యులు కోక్లియర్ ఇంప్లాంట్ శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. ఆస్పత్రిలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో అపోలో ఈఎన్‌టీ విభాగాధిపతి డా.ఈ.సి.వినయ్ కుమార్ మాట్లాడారు. దక్షిణ అమెరికా గయానాలో భారతీయ మూలాలు ఉన్న దంపతులకు జన్మించిన శిశువుకు పుట్టుకతోనే తీవ్ర వినికిడి లోపం ఏర్పడిందన్నారు. శిశువు తల్లిదండ్రులు బ్రెజిల్, వెనిజులా, అమెరికా, కెనడాకు వెళ్లినప్పటికీ ఫలితం లేకపోవడంతో హైదరాబాద్ అపోలను ఆశ్రయించారని తెలిపారు. శిశువుకు పరీక్షలు నిర్వహించగా, కోక్లియర్ హైపోప్లాసియా, ఎడమ చెవిలో అసాధారణ కోక్లియా నిర్మాణం ఉన్నట్లు స్కానింగ్‌లో తేలిందన్నారు. శ్రీ సత్యసాయి సంస్థ ద్వారా తాము కోక్లియార్ ఇంప్లాంట్‌ను విజయవంతంగా అమర్చినట్టు చెప్పారు. సమావేశంలో అపోలో ఆస్పత్రుల తెలంగాణ ప్రాంత సీఈఓ తేజస్వీ రావు, సీనియర్ కన్సల్టెంట్ డా.కె.రాంబాబు, డా.జస్వీందర్‌సింగ్ సలూజా, ఇంప్లాంటేషన్ ఆడియాలజిస్ట్ డా.ఐ.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ధర్మకర్తలుగా ప్రమాణస్వీకారం

అమీర్‌పేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట డివిజన్ బాపునగర్ శ్రీ వీరాంజనేయ శ్రీ వెంకటేశ్వర శ్రీ సాయిబాబా ఆలయం, ఎస్ఆర్‌నగర్‌లోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయాలకు ధర్మకర్తలను నియమిస్తూ దేవాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మంగళవారం దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. బాపునగర్‌లోని ఆలయానికి నూతన ధర్మకర్తలుగా పి.వెంకటరాఘవేంద్రరావు, ప్రతాప్‌సింగ్, ఎం.సతీష్‌బాబు, సభావత్ రమేష్, గోవర్ధన్, ఎస్ఆర్‌నగర్‌లోని శ్రీ వేంకటేశ్వర ఆలయానికి ఫౌండర్ చైర్మన్‌గా బొడ్డు కుమార్‌గౌడ్, ధర్మకర్తలుగా అనిల్ కుమార్‌గౌడ్, ఆర్.ప్రేమ్‌కుమార్, దూసరి పద్మావతి, ఎస్.నాగమణి, ఎక్స్‌అఫిషియో సభ్యులుగా కె.వేణుగోపాలచార్యులు, బాపునగర్ ఆలయానికి పి.వేణుగోపాలచార్యులు నియమితులయ్యారు. కార్యక్రమంలో ఈవో నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, గోదాస్ నవీన్, బాపునగర్ బస్తీ ప్రెసిడెంట్ హరిసింగ్ జాదవ్, బస్తీవాసులు పాల్గొన్నారు.


ధర్మకర్తలుగా ప్రమాణస్వీకారం చేసిన నూతన సభ్యులు

అవగాహన ఒప్పందాలు పునరుద్ధరణ

హైదరాబాద్ సిటీ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): డా.బి.ఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో ఎంబీఏ, హాస్పిటల్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్ (హెచ్‌హెచ్‌సీఎం) కోర్సును అందించడానికి విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొ.ఘంటా చక్రపాణి సమక్షంలో మంగళవారం మూడు విద్యాసంస్థలతో అవగాహన ఒప్పందాలు పునరుద్ధరించుకుంది. అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్ (ఏఐహెచ్‌సీఎం), కిమ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ(కిమ్స్), దారుస్సలాం ఎడ్యుకేషనల్ ట్రస్ట్, (డీఈటీ)తో వేర్వేరుగా అవగాహన ఒప్పందాలు పునరుద్ధరణ చేసుకున్నట్లు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా.ఎల్.విజయకృష్ణారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో అపోలో నుంచి డా.భాస్కర్‌రెడ్డి, ప్రొ.విజయరుద్రరాజు, కిమ్స్ నుంచి డా.రాజేంద్ర అన్నే, ప్రొ.రవికుమార్, దారుస్సలాం ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నుంచి డా.మనీషా సక్సేనా తదితరులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.


అవగాహన ఒప్పందం చేసుకుంటున్న వర్సిటీ రిజిస్ట్రార్ డా.ఎల్.విజయకృష్ణారెడ్డి, తదితరులు


సమావేశంలో మాట్లాడుతున్న ప్రఫుల్ రాంరెడ్డి

నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు

● తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ

బర్కత్‌పుర, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ఈ నెల 4 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ తెలిపింది. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి, సెక్రటరీ జనరల్ తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శులు బత్తుల సోమన్న, క్రిష్టోఫర్ మాట్లాడారు. ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, రూ. 25వేల పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చారని, వీటి అమలును రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవంలో ప్రకటించకపోవడంతో ఉద్యమకారులు నిరాశతో ఆందోళనకు సిద్ధమయ్యారని తెలిపారు. శాంతియుతంగా అన్ని జిల్లాల్లో నిరాహార దీక్షలు, ధర్నాలు చేస్తామన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేల కార్యక్రమాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు కె.మాధవిరెడ్డి, సుమతి, శంకర్‌రావు పాల్గొన్నారు.

తెరుచుకోనున్న విద్యాసంస్థలు..
జనన ధ్రువీకరణ పత్రాలకు పెరిగిన ప్రాధాన్యం

సికింద్రాబాద్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): త్వరలో విద్యా సంస్థలు తెరుచుకోనున్న నేపథ్యంలో జనన ధ్రువీకరణ పత్రాలకు ప్రాధాన్యత పెరిగింది. కొత్తగా బడిలో చేర్పించే పిల్లలకు ఈ పత్రాలు తప్పనిసరి కావడంతో తల్లిదండ్రులు స్థానిక సంస్థల కార్యాలయాల వద్ద క్యూ కడుతున్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని తల్లిదండ్రులు తమ పిల్లల జనన ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాల్సిందిగా బోర్డు కార్యాలయానికి విచ్చేస్తున్నారు. దాంతో బోర్డు కార్యాలయం చిన్నారులు, తల్లిదండ్రులతో సందడిగా మారింది. కాగా తగిన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకున్న వారికి వీలైనంత త్వరగా పత్రాలు జారీ చేస్తున్నామని కంటోన్మెంట్ ఆరోగ్య శాఖాధికారి దేవేందర్ తెలిపారు.



పోలీస్ చెక్‌పోస్టును పరిశీలిస్తున్న ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి

బక్రీద్ సందర్భంగా నేరాల నియంత్రణకు చర్యలు

● డీసీపీ బాలస్వామి

అడ్డగుట్ట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : నేరాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నామని ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి తెలిపారు. మంగళవారం లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లాలాగూడ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాలాగూడ శాంతినగర్, ఈసీఐఎల్, మౌలాలితో పాటు మల్కాజిగిరి, హనుమాన్‌పేట్, నేరేడ్‌మెట్ ప్రాంతాల నుంచి సికింద్రాబాద్ మెట్టుగూడ, ఉప్పల్, హబ్సిగూడ వైపు వెళ్లాలంటే లాలాగూడ చౌరస్తా మీదుగా వెళ్లాల్సి ఉంటుందని, ఇరవై నాలుగు గంటలు పోలీస్ చెక్‌పోస్టులో పోలీసులు విధి నిర్వహణలో ఉంటారన్నారు. డీసీపీ వెంట ఏసీపీ శశాంక్‌రెడ్డితో పాటు లాలాగూడ ఇన్‌స్పెక్టర్ రఘుబాబు, ఎస్సై సాహేద్‌లతో పాటు పోలీసులు ఉన్నారు.

'సబ్ కంట్రోల్ రూమ్' ఏర్పాటు చేయాలి

అడ్డగుట్ట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తుకారాంగేట్ చౌరస్తాలో పోలీస్ సబ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని బీజేపీ సీనియర్ నాయకుడు నర్సింగ్‌రావు, గంగారాం, రాజారాం, దుర్గాప్రసాద్‌లు మంగళవారం తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నర్సింగ్‌రావు మాట్లాడుతూ ఈ చౌరస్తా ఇరవై నాలుగు గంటలు ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని, ఇక్కడ ఒక పోలీస్ సబ్ కంట్రోల్ రూమ్‌తోపాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

స్పందించిన అధికారులు.. వెలిగిన వీధి దీపాలు

అడ్డగుట్ట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : కొంతకాలంగా అడ్డగుట్ట డివిజన్ శాస్త్రీనగర్ బస్తీలో వీధిదీపాలు వెలగడంలేదని రుద్రవీణా మహిళా సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు నక్కల శోభతో పాటు కొందరు మహిళలు లాలాగూడ విద్యుత్ అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. స్పందించిన లాలాగూడ విద్యుత్ అధికారులు మంగళవారం ఆరు చోట్ల విద్యుత్ స్తంభాలకు కొత్త వీధి దీపాలను బిగించి వినియోగంలోకి తీసుకొచ్చారు.

పండుగలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ శశాంక్‌రెడ్డి

బౌద్ధనగర్, జూన్3(ఆంధ్రజ్యోతి): పండుగలను భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవాలని చిలకలగూడ డివిజన్ ఏసీపీ కె.శశాంక్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఏసీపీ కార్యాలయంలో చిలకలగూడ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అనుదీప్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్పొరేటర్లు, పీస్ కమిటీ, వివిధ విభాగాల అధికారులతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ బక్రీద్ పండుగను మతాలకతీతంగా శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కంది‌శైలజ, సామల హేమ, ఇన్‌స్పెక్టర్లు అనుదీప్, మధుసూదన్‌రెడ్డి, రఘుతో పాటు, మాజీ కార్పొరేటర్ కందినారాయణ, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగాల పేరిట మోసం.. వ్యక్తి అరెస్టు

తిరుమలగిరి జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ బోయిన్‌పల్లి బాపూజీనగర్‌కు చెందిన కొల్లాపురం శ్రవణ్‌కుమార్(36) నిరుద్యోగి. అతడు నిరుద్యోగ యువతీ యువకులను పరిచయం చేసుకుని ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ డబ్బులు వసూలు చేస్తున్నాడు. ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం తిరుమలగిరికి చెందిన ఓ మహిళ నుంచి సుమారు రూ.22వేలు తీసుకుని ఆర్మీలో ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేశాడు. కొన్ని రోజుల నుంచి ఫోన్ చేసినా సమాచారం ఇవ్వకపోవడంతో మోసపోయానని గమనించిన ఆమె తిరుమలగిరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు విశ్వసనీయ సమాచారం మేరకు తిరుమలగిరి పోలీస్ స్టేషన్ సమీపంలోని ఆర్టీఏ కార్యాలయం వద్ద శ్రవణ్‌ను అదుపులోకి తీసుకుని పోలీసులు తమదైన శైలిలో విచారించారు. దీంతో శ్రవణ్‌కుమార్ నేరం అంగీకరించడంతో అతన్ని రిమాండ్‌కు తరలించారు. అతడి నుంచి ఓ మొబైల్ ఫోన్‌ను సీజ్ చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి



సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : రైలు పట్టాల వద్ద పడి ఉన్న గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహాన్ని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి హుస్సేన్‌సాగర్ సమీపంలోని రైలు పట్టాల వద్ద 60 ఏళ్ల వృద్ధుడిని రైలు ఢీకొట్టడంతో రైలు పట్టాల వద్ద చనిపోయి ఉన్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. అతడి ఆచూకీ ఇంకా తెలియరాలేదని రైల్వే పోలీసులు తెలిపారు. ఈ వృద్ధుడి ఆచూకీ తెలిస్తే 9440700040 కు సమాచారం ఇవ్వాలని రైల్వే పోలీసులు కోరారు. కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



బోయినపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో బాలంరాయి చౌరస్తా వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ శివశంకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం తాడ్‌బండ్ నుంచి సికింద్రాబాద్ వైపుకు వెళ్లే రహదారిలోని బాలంరాయి చౌరాస్తా వద్ద ఉన్న ఓ మెకానిక్ షాప్‌కు సంబంధించిన పార్కింగ్ స్థలంలో ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కాగా మృతుడి చేతిని కుక్కలు పీక్కుతిన్నాయని తెలిపారు. దీంతో పోలీసులు అక్కడికి వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి మృతి



అడ్డగుట్ట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్‌లో ఓ గుర్తుతెలియని యువకుడు మృతి చెందిన ఘటన గోపాలపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై వేణుగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ బోయగూడ మెట్రో పిల్లర్ 1305 వద్ద ఫుట్‌పాత్‌పై గుర్తుతెలియని 35 ఏళ్ల యువకుడు మృతి చెంది ఉన్నాడన్న సమాచారం అందుకున్న గోపాలపురం పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. ఈ మృతుడి ఆచూకీ తెలిస్తే గోపాలపురం పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్‌సీసీ డ్రైన్ పనుల్లో జాప్యం!

- కాలయాపన చేస్తున్న కాంట్రాక్టర్
- అసహనం వ్యక్తం చేస్తున్న బస్తీవాసులు



ఆర్‌సీసీ డ్రైన్ కోసం తవ్విన దృశ్యం

రెజిమెంటల్‌బజార్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం సమీపిస్తున్నా నూతన ఆర్‌సీసీ డ్రైన్ నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. అసలే లోతట్టు ప్రాంతం. ఇలాగే కొనసాగితే ఈ సంవత్సరం కూడా వరద సమస్య ఉంటుందని బస్తీవాసులు ఆందోళన పడుతున్నారు. మోండా డివిజన్ రెజిమెంటల్‌బజార్‌లోని గురుద్వార పక్క వీధిలో వరదనీటి సమస్యతో బస్తీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడిందంటే చాలు వరదనీరు ఇళ్లలోకి చేరుతుంది. ఈ సమస్య పరిష్కారానికి స్థానికులు జీహెచ్ఎంసీ, కార్పొరేటర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో రూ.37 లక్షల వ్యయంతో నూతన ఆర్‌సీసీ డ్రైన్ నిర్మాణానికి ఫిబ్రవరి నెలలో ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే శ్రీగణేష్, కార్పొరేటర్ కొంతం దీపిక శంకుస్థాపన చేశారు. కానీ పనులు మొదలు పెట్టిన కాంట్రాక్టర్ శ్రద చూపకపోవడంతో ముందుకు సాగడం లేదు. దీంతో బస్తీవాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

● ఆర్‌సీసీ డ్రైన్ పనుల కోసం తవ్వుతున్న సమయంలో కాంట్రాక్టర్ కనీస జాగ్రత్తలు తీసుకోకుండా ఇష్టానుసారంగా ఎక్సకవేటర్‌తో తవ్వడంతో డ్రైనేజీ, తాగునీటి పైపు లైన్లు పగిలిపోయి ఆ నీరు ఆర్‌సీసీ డ్రైన్ కోసం తవ్విన గుంతలోకి వస్తున్నాయి. దీంతో పనులకు ఆటంకం కలుగుతుంది. కాంట్రాక్టర్ మాత్రం తన తప్పును కప్పిపుచ్చుకునేందుకు నీళ్లు వస్తున్నాయి పనులు ఎలా చేయాలంటూ కాలయాపన చేస్తున్నాడని బస్తీవాసులు ఆరోపిస్తున్నారు.



నిర్మాణంలో ఉన్న ఆర్‌సీసీ డ్రైన్

సీవరేజ్ లైన్ తర్వాత మిగతా పనులు చేస్తాం

స్టార్మ్ వాటర్ పైప్‌లైన్ పక్కనే సీవరేజ్ లైన్ ఉంది. దీంతో ఆర్‌సీసీ డ్రైన్ పనులు కోసం తవ్వితే సీవరేజ్ లైన్ డ్యామేజ్ అవుతుంది. కనుక ఇప్పటికే ఆర్‌సీసీ డ్రైన్ కోసం మొదలు పెట్టిన 40మీటర్ల దూరం పనులు పూర్తి చేసి, కాంట్రాక్టర్‌కు బిల్ అంతవరకే చెల్లిస్తాం. మిగతా ఆర్‌సీసీ డ్రైన్ పనులు వాటర్ వర్క్స్ అధికారులు సీవరేజ్ పైపులైన్ వేసిన తర్వాత పూర్తిచేస్తాం.

\- చంద్రశేఖర్, ఏఈ

ఇబ్బందులు పడుతున్నాం

వర్షం వస్తే వరదనీరు ఇళ్లలోకి వస్తోంది. వరద నీరు వెళ్లే సరైన మార్గం లేక నిలిచిపోతున్నాయి. దీంతో అవస్థలు పడుతున్నాం. వర్షాకాలం ప్రారంభానికి ముందే పనులు పూర్తి చేయాలి. తొందరగా పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలి.

\- రాజు, రెజిమెంటల్‌బజార్

రికార్డుస్థాయిలో 12.832 ఎంటీల వస్తురవాణా: దక్షిణ మధ్య రైల్వే

హైదరాబాద్, జూన్ 3(ఆంధ్రజ్యోతి):దక్షిణమధ్య రైల్వే మేలో 12.832 మిలియన్ టన్నుల సరుకులను గమ్యస్థానాలకు చేర్చి రికార్డును నమోదు చేసుకుంది. గతఏడాది 2024 మేలో 12.418 మిలియన్ టన్నుల వస్తు సామగ్రిని రవాణా చేయగా ప్రస్తుత ఏడాదిలో రికార్డు స్థాయిలో వస్తు సామగ్రిని గమ్యస్థానాలకు చేర్చినట్టు రైల్వే అధికారులు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మే నెలాఖరు నాటికి 25.194 మిలియన్ టన్నుల వస్తు సామగ్రిని రవాణా చేసినట్టు అధికారులు పేర్కొన్నారు. ఈ విభాగం కార్యకలాపాలపై జీఎం అరుణ్‌కుమార్ జైన్ ప్రత్యేక చొరవ తీసుకుని ఆరు డివిజన్ల ప్రధాన విభాగాధిపతులు, డివిజనల్ రైల్వే మేనేజర్లతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించి చర్యలు తీసుకోవడంతో రికార్డు స్థాయిలో వస్తురవాణా చేయగలిగినట్టు అధికారులు వివరించారు. ప్రధానంగా వ్యాగన్ల సరఫరాను క్రమబద్ధీకరించడంతో పాటు సరుకు రవాణా రైళ్ల రాకపోకలను పర్యవేక్షించేందుకు ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడంతో మే నెలలో సరుకు రవాణాలో గణనీయమైన మెరుగుదల నమోదైనట్టు రైల్వే అధికారులు పేర్కొన్నారు. ప్రధానంగా మే నెలలో బొగ్గు లోడింగ్ 6.472 మిలియన్ టన్నులుండగా గడచిన 2024 మేలో 6.280 మిలియన్ టన్నుల లోడింగ్‌ను చేసినట్టు తెలిపారు. ఇక సిమెంట్ లోడింగ్ 3.306 మిలియన్ టన్నులు, ఇనుప ఖనిజం 0.732 మిలియన్ టన్నుల వరకు లోడింగ్ చేసినట్టు వివరించారు. అలాగే ఉక్కు కర్మాగారాలకు ముడి పదార్థాలు, ఆహార ధాన్యాలు, ఎరువులు, పెట్రోలియం ఉత్పత్తులు, కంటైనర్లు ఇతరత్రా 2,322 మిలియన్ టన్నులు రవాణా చేసి రికార్డు నెలకొల్పినట్టు పేర్కొన్నారు.

రాంగోపాల్‌పేట్ పోలీస్ స్టేషన్ తరలింపు

● నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్



జేమ్స్ స్ట్రీట్ (పాత రాంగోపాల్‌పేట్) పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్

రాంగోపాల్‌పేట్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : రాంగోపాల్‌పేట్ పోలీస్ స్టేషన్‌ను వారం రోజుల్లో తరలించనున్నట్లు సైబరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. మంగళవారం తుది మెరుగులు దిద్దుకుంటున్న సికింద్రాబాద్ మహాత్మాగాంధీ రోడ్డులోని జేమ్స్ స్ట్రీట్(పాత రాంగోపాల్‌పేట్) పోలీస్‌స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వంద సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన రాంగోపాల్‌పేట్ పోలీస్ స్టేషన్ శిథిలావస్థలో ఉండడంతో 9 సంవత్సరాల క్రితం పోలీస్‌సేషన్‌ను ఇక్కడి నుంచి తరలించి హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో మరమత్తులు చేపట్టి ఇప్పుడు పోలీసులకు అప్పగించామన్నారు. ప్రస్తుతం పోలీస్‌స్టేషన్‌ను ఇక్కడికి తరలించడం వల్ల ప్రజలకు మరింత అందుబాటులోకి వస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కమిషనర్ వెంట ఉత్తర మండల డీసీపీ చందన రష్మీ పెరుమాళ్, అదనపు డీసీపీ అశోక్, ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, ట్రాఫిక్ అదనపు డీసీపీ వేణుగోపాల్ రెడ్డి, మహంకాళి ఏసీపీ సైదయ్య, రాంగోపాల్‌పేట్ ఇన్‌స్పెక్టర్ నర్సింగరావు, మహంకాళి ఇన్‌స్పెక్టర్ పరశురామ్, సేఠ్ రాంగోపాల్ మలానీ ట్రస్ట్ సభ్యులు, హెచ్ఎండీఏ అధికారులు ఉన్నారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు

బౌద్ధనగర్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని సికింద్రాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు తీగుళ్ల పద్మారావుగౌడ్ అధికారులను హెచ్చరించారు. మంగళవారం సీతాఫల్‌మండి క్యాంపు కార్యాలయంలో సికింద్రాబాద్ నియోజకవర్గ అభివృద్ధి కార్యకలపాలపై వివిధ విభాగాల అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బక్రీద్ పండుగ ఏర్పాట్లు, స్కూల్స్‌కు ప్రారంభం కానున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలు, టాక్స్, హౌసింగ్ సమస్యలు, నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పెండింగ్ తదితర సమస్యలపై ఆయా విభాగాల అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల కొరత ఎదురుకావటం శోచనీయమన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ, కంది‌శైలజ, సునీత, ప్రసన్నలక్ష్మీ, వివిధ విభాగాల అధికారులు సుబ్రమణ్యం, వెంకటేశ్, రవీందర్, శ్రీనాద్, జీఆర్‌కే రెడ్డి, సువర్ణ, గణేష్, కృష్ణయ్య, సంధ్య, లావణ్య, సునీత, హేమలత, డాక్టర్ మారుతీ, తహసీల్దార్ బీమయ్యగౌడ్, విద్యాధికారి ప్రతాప్‌రెడ్డి, డాక్టర్ వందన, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కొత్త విగ్రహాల ఏర్పాటు

సీతాఫల్‌మండి చౌరస్తాలో ప్రస్తుతం ఉన్న అంబేడ్కర్ విగ్రహం స్థానంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ నూతన విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ తెలిపారు. మంగళవారం నూతన విగ్రహాలను ఏర్పాటు చేసే ప్రదేశాన్ని ఎమ్మెల్యే, కార్పొరేటర్లు, అధికారులతో కలిసి పరిశీలించారు. తన సొంత నిధులతో ఈ విగ్రహాలను ఏర్పాటుచేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

న్యాయవాది సంక్షేమ నిధిని పెంచాలని వినతి

అడ్డగుట్ట, జూన్ 3(ఆంధ్రజ్యోతి): న్యాయవాది సంక్షేమ నిధి ప్రయోజనాన్ని రూ. 6 లక్షల నుంచి రూ.12 లక్షలు పెంచాలని తెలంగాణ న్యాయవాదుల నోటరీస్ అసోసియేషన్ అధ్యక్షుడు గంజి యాదగిరి మంగళవారం తెలంగాణ రాష్ట్ర న్యాయవాదుల మండలి అధ్యక్షుడికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల సమావేశమై సంక్షేమ టికెట్ ధరను రూ.100 నుంచి రూ.250కి పెంచిన విధానాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. అందుకని ప్రస్తుతం న్యాయవాది సంక్షేమనిధి ప్రయోజనాన్ని పెంచాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి

తిరుమలగిరి జూన్ 3 (ఆంధ్రజ్యోతి): దేవాలయాలను మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నామని ఈఓ మహేందర్ రెడ్డి అన్నారు. బొల్లారం డౌటన్ బజార్‌లోని హనుమాన్ దేవాలయంలో భక్తుల సౌకర్యార్థం అన్ని వసతులు కల్పించామని మంగళవారం ఆంధ్రజ్యోతికి తెలిపారు. అదేవిధంగా బహదూర్‌పురలోని మల్లన్నస్వామి దేవాలయం ఇన్‌చార్జిగా ఆ దేవాలయాన్ని కూడా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. మల్లన్నస్వామి దేవాలయం ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు 6న జరగనున్నాయని తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని సూచించారు.

మెట్టుగూడ టు సీతాఫల్‌మండి మార్గం సుగమం



రైల్వే బ్రిడ్జి వద్ద హర్షం వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

చిలకలగూడ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): దూద్‌బావి నుంచి ఆలుగడ్డబావికి వెళ్లే మార్గంలో రైల్వే బ్రిడ్జి నిర్మించడంతో మెట్టుగూడ, సీతాఫల్‌మండి వాసులకు మార్గం సుగమమైందని బీజేపీ మెట్టుగూడ డివిజన్ అధ్యక్షులు ఆదర్శ్ ముదిరాజ్ అన్నారు. దూద్‌బావి నుంచి ఆలుగడ్డబావి మార్గంలో నూతనంగా నిర్మించిన బ్రిడ్జిని బీజేపి శ్రేణులతో కలసి మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిలకలగూడ, సీతాఫల్‌మండి నుంచి మెట్టుగూడకు సరైన మార్గం లేక ప్రజలు అవస్థలు ఎదుర్కొన్నారని తెలిపారు. ఈ సమస్యను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి దృష్టికి తీసుకురాగా బ్రిడ్జి నిర్మాణంపై ఆయన ప్రత్యేక శ్రద్ధ వహించి, త్వరితగతిన నిర్మాణం జరగటానికి కృషి చేశారని అన్నారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేశారని తెలిపారు. కార్యక్రమంలో దిశ కమిటీ మెంబర్ శారద మల్లేశ్, నాయకులు సత్తూరి రవీందర్, రాజేశ్, శ్రీధర్ రావు, నీలం శ్రీనివాస్, సరోజ, నాగమల్లేశ్వరి, మంజుల, వరుణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో భవన నిర్మాణ కార్మికుడి మృతి



ఘటన స్థలంలో దర్యాప్తు చేస్తున్న బోయినపల్లి పోలీసులు

బోయినపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తి అనుమానస్పద స్థితిలో మృతి చెందిన ఘటన బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అయ్యప్ప సొసైటీ తోకట్టలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్ర గొందియా జిల్లా కకోడి దేవారి గ్రామానికి చెందిన బీహారి పారిఖ్ రౌత్ తన భార్య, పిల్లలతో బోయినపల్లికి వచ్చి, అయ్యప్ప సొసైటీ తోకట్టలో ఓ ఇంటి భవన నిర్మాణ కార్మికుడిగా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం తెల్లవారుజామున నిర్మాణంలో ఉన్న ఆ భవనం రెండో అంతస్తుపై పని చేయడానికి వెళ్లాడు. ఈ క్రమంలో భవనం పైనుంచి కాలుజారి కింద పడిపోయాడు. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయాలై, అతడు అక్కడిక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న బోయినపల్లి ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు, డీఐ సర్దార్ నాయక్, ఎస్ శివశంకర్, గిరధర్‌లు ఆ ప్రాంతాన్ని క్లూస్ టీమ్ సహాయంతో అన్ని కోణాలతో దర్యాప్తు చేశారు. మృతుడికి మద్యం సేవించే అలవాటు ఉందని భార్య, కుమారుడు పోలీసులకు తెలిపారు. దీంతో ఆ కోణంలో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులకు ఆ ప్రాంతంలో మద్యం సేవించిన బాటిల్ లభ్యమైంది. దానిని స్వాధీనం చేసుకుని క్లూస్ టీమ్‌కు అందజేసి, కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. అనంతరం కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అడ్డగుట్టలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

● కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట, జూన్ 3(ఆంధ్రజ్యోతి): అడ్డగుట్ట డివిజన్‌లో మూడు రోజులపాటు శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని మంగళవారం అడ్డగుట్ట డివిజన్ కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ శానిటేషన్ ఈఈ వెంకటేష్, రాంకీ, ఏఈ దశరథ్‌లతో పాటు బీఆర్ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్, మోహన్, శ్రీశైలం పాల్గొన్నారు.



ఎమ్మెల్యే పద్మారావును కలిసిన తుకారాంగేట్ బోయబస్తీ వాసులు

బోయబస్తీ కమ్యూనిటీ హాల్‌ను ఉపయోగించుకోండి

అడ్డగుట్ట, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : అడ్డగుట్ట ప్రభుత్వ ఆరోగ్యకేంద్ర స్థలంలో నిర్మించబోయే ముప్పై పడకల ఆస్పత్రి ప్రజల కోసమని, ఆస్పత్రి నిర్మాణ సమయంలో తాత్కాలికంగా ఈ బోయబస్తీలో ఉన్న కమ్యూనిటీహాలును ఉపయోగించుకోవచ్చని బోయబస్తీ కమిటీ అధ్యక్షుడు కైరంకొండ యాదగిరి, ప్రధాన కార్యదర్శి కర్రెలి రామానుజం, గౌటి సురేందర్, కే. గంగారం, ఎం. నారాయణ, సతీష్, రమేష్‌లతో పాటు కమిటీ సభ్యులు నిర్ణయించుకుని ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు హయంలో ముప్పై పడకల ఆస్పత్రి రావడం అనేది మంచి విషయమని అవసరమైతే తాత్కాలికంగా తమ బస్తీలో ఉన్న కమ్యూనిటీహాలును కొన్ని రోజుల వరకు అడ్డగుట్ట ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం వినియోగించుకోవచ్చన్నారు. తమ బోయబస్తీలో అభివృద్ధి జరిగిందంటే ఎమ్మెల్యే పద్మారావు హయంలోనే జరిగిందని తెలిపారు.



రైల్వే సీనియర్ డీసీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మజ్దూర్ యూనియన్ జోన్ కార్యదర్శి రవీందర్

టికెట్ చెకింగ్ స్టాఫ్ సమస్యలు పరిష్కరించాలి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : రైల్వే టికెట్ చెకింగ్ స్టాఫ్ సమస్యలు పరిష్కరించాలని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ డివిజన్ అధ్యక్షుడు కాల్వ శ్రీనివాస్, కార్యదర్శి టి.రవీందర్ మంగళవారం దక్షిణ మధ్య రైల్వే సీనియర్ డీసీఎం అధికారిణి శిఫాలీని కోరారు. నూతన డీసీఎంగా బాధ్యతలు చేపట్టిన శిఫాలీని మర్యాదపూర్వకంగా రైల్వే టీటీలు సికింద్రాబాద్ రైల్వే సంచాలన్ భవన్‌లో కలిశారు. రైల్వే టికెట్ చెకింగ్ స్టాఫ్‌కు రెస్ట్ రూముల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో యుగేందర్, సమ్మయ్య, వేద ప్రకాశ్, సలీం, శ్రీనయ్య, రాజేష్, అనిల్ ఉన్నారు.

రెండు వారాలకు మించి జ్వరం ఉంటే వైద్యుల్ని సంప్రదించాలి

అడ్డగుట్ట, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : రెండు వారాల పాటు జ్వరం, దగ్గు ఉంటే వెంటనే ప్రభుత్వ ఆరోగ్యకేంద్రంలో వైద్యుల్ని సంప్రదించాలని ఎస్‌పీహెచ్ఓ డాక్టర్ జయశ్రీ తెలిపారు. మంగళవారం అడ్డగుట్ట ప్రభుత్వ ఆరోగ్యకేంద్రంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కింద స్క్రీనింగ్ క్యాంప్ అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముఖ్యంగా వనరబుల్ పాపులేషన్ మురికివాడలతో పాటు గురుకుల హాస్టళ్లు, నైట్ షెల్టర్లలో టీబీ వ్యాధిపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. రెండు వారాలకు మించి జ్వరంగా దగ్గు సాయంత్రం సమయంలో జ్వరం, బరువు తగ్గడం ఇతర లక్షణాలు ఉంటే ప్రభుత్వ ఆరోగ్యకేంద్రంలోని టీబీ ప్రతినిధులను కలిసి వైద్యం చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సరిత, టీబీ సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్లు సివిఎస్ రాజు, జగత్‌కుమార్, సుబ్బారావు, జయసింహా, శ్రావణ్‌లతో పాటు అడ్డగుట్ట ప్రభుత్వ ఆరోగ్యకేంద్రం ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కబ్జా చెర నుంచి శ్మశాన వాటికను రక్షించండి

రాంగోపాల్‌పేట్, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : బన్సీలాల్‌పేట్ డివిజన్ గాంధీనగర్‌లో వంద సంవత్సరాల నాటి కురుమ కులస్తుల శ్మశానవాటికను గుర్తు తెలియని వ్యక్తులు కబ్జా చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కురుమ సంఘం ఉపాధ్యక్షుడు చీర శ్రీకాంత్ అధికారులను కోరారు. మంగళవారం కబ్జాకు గురైన శ్మశానవాటిక స్థలాన్ని కురుమ సంఘం నేతలతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు లిఖితపూర్వక ఫిర్యాదు చేసి చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం సికింద్రాబాద్ తహసీల్దార్ పాండు నాయక్‌కు, హైడ్రా కమిషనర్‌కు కూడా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసి, హైడ్రా ఏసీపీ తిరుమల్‌ను కలిసి వివరాలను అందజేశారు. కార్యక్రమంలో కురుమ సంఘం నేతలు సునీల్, శివప్రసాద్, నటరాజ్, ప్రవీణ్, సుశీల్, వినోద్, యశ్వంత్, దినేష్, రాజు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.